క్లుప్తంగా

పరామర్శ



సీతారామపురం : ఆటోలో ప్రయాణిస్తూ నిద్ర మత్తులో జారిపడి మృతి చెందిన 108 ఉద్యోగి ఓంకారం వెంకటనారాయణరాజు కుటుంబ సభ్యులను 108 ఉద్యోగుల యూనియన్ రాష్ట్రాధ్యక్షుడు బల్లి కిరణ్‌కుమార్, భవ్య హెల్త్ సర్వీసెస్ జోనల్ మేనేజర్ పవన్‌కుమార్ బుధవారం పరామర్శించారు. సీతారామపురంలోని ఓంకారం ఇంటికి వెళ్లి ఆయన మృతిపై విచారం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు నగదు అందజేశారు కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

ఇరిగేషన్ ఈఈ బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎం రవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈఈగా పనిచేస్తున్న ఆర్ వెంకటేశ్వర్లు సాధారణ బదిలీల్లో భాగంగా ఒంగోలుకు వెళ్లారు. ఆయన స్థానంలో ఎం రవి ఒంగోలు నుంచి ఆత్మకూరుకు వచ్చారు. కాగా నూతన ఈఈ మాట్లాడుతూ తాను గతంలో ఆత్మకూరు ఇరిగేషన్ శాఖ డీఈగా పనిచేశానని, ఈ ప్రాంతంపై తనకు అవగాహన ఉందన్నారు. రైతులకు సాగునీరు సజావుగా అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నూతన ఈఈను పలువురు ఏఈలు, సిబ్బంది కలిసి అభినందించారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌గా సమీరారెడ్డి



సమీరారెడ్డి

సీతారామపురం : స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌గా సిరిపురపు సమీరారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కర్నూలు జిల్లా కోసిగి ఆదర్శ పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ముజిబుల్ రెహమాన్ గుంటూరు జిల్లా దుర్గి ఆదర్శ పాఠశాలకు బదిలీ అయ్యారు.

నర్రవాడ తిరునాళ్లకు ఉచిత బస్సు సర్వీసులు



కలిగిరి: మండలంలోని జిర్రావారిపాళేనికి చెందిన పాపన హరిబాబు నర్రవాడ వెంగమాంబ తిరునాళ్లకు వెళ్లే భక్తుల కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. తనకు చెందిన హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన నాలుగు బస్సులను నర్రవాడకు బుధవారం ఏర్పాటు చేశారు. కలిగిరిలో ఎస్సై ఎం ఉమాశంకర్ బస్సులను ప్రారంభించారు.

వెలుగు ఏపీఎంగా షారా స్రవంతి



ఉదయగిరి: మండల వెలుగు కార్యాలయ ఏపీఎంగా షారా స్రవంతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె నెల్లూరు డీఆర్డీఏ కార్యాలయంలో ఉన్నతి ఏపీఎంగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఉదయగిరికి వచ్చారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. నూతన ఏపీఎం మాట్లాడుతూ సీసీలు నిర్దేశించిన లక్ష్యాను సకాలంలో పూర్తి చేయాలన్నారు.

ఎస్సైకు వినతి



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని డాక్టర్ బీఎస్సార్ ఆస్పత్రి, ఎడ్యుకేషనల్ కమిటీ చైర్మన్ బొమ్మిరెడ్డి తారకనాథ్ రెడ్డి తరుపున ఆ కార్యాలయ సిబ్బంది ఆత్మకూరు ఎస్సై జిలానిని కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఇటీవల మున్సిపల్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని విన్నవించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి భవిష్యత్‌లో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఎండీ సాధిక్ హుస్సేన్, షరీఫ్, మల్లికార్జున, షారూక్, భార్గవ్, సల్మాన్, జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నర్రవాడలో భక్తజన కోలాహలం



వెంగమాంబ ఆలయానికి పసుపు, కుంకుమను ప్రత్యేక వాహనంలో తీసుకొస్తున్న భక్తులు



హోమగుండంలో ఎండుకొబ్బరి వేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

దుత్తలూరు: నర్రవాడలో భక్తజన కోలాహలం నెలకొంది. వెంగమాంబ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన కల్యాణోత్సవాన్ని బుధవారం నేత్రపర్వంగా నిర్వహించారు. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వలసవాసులు భారీగా తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. అమ్మవారిని దర్శించుకుని హోమగుండంలో ఎండుకొబ్బరి వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో పాటు స్వర్ణ భారత్ ట్రస్ట్ చైర్మన్ దీపా వెంకట్, ఆర్టీసీ నెల్లూరు రీజియన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, దేవదాయ శాఖ అధికారులు, తదితరులు వెంగమాంబను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి భక్తుల కోసం ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు.

ప్రత్యేక క్యూలైన్లు లేక భక్తుల అవస్థ

వెంగమాంబ అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారుల తల్లిదండ్రులు ప్రత్యేక క్యూలైన్లు లేక గంటల తరబడి వేచిఉండాల్సి రావడంతో అవస్థలు పడ్డారు. అధిక శాతం మంది రాజకీయ సిఫార్సులతో అమ్మవారిని దర్శించుకోగా, సాధారణ క్యూలైన్లలో ఉన్న భక్తులు దర్శనం ఆలస్యం కావడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో పాటు రూ.100 టిక్కెట్ల ద్వారా ఆలయానికి వచ్చే ఆదాయం కూడా తగ్గిపోయింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గిందని పలువురు చర్చించుకుంటున్నారు. కాగా వెంగమాంబ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం బండ్ల పొంగళ్లు, వెంగమాంబ దంపతులకు ముగింపు పూజలు, ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఎడ్ల బండలాగుడు పోటీల్లో గెలిచిన ఎడ్ల యజమానులకు నగదు బహుమతులు అందజేయనున్నారు.





వెంగమాంబ దంపతులకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న వ్యవస్థాపక ధర్మకర్తలు, ఎమ్మెల్యే కాకర్ల

50శాతం రాయితీతో పచ్చరొట్ట విత్తనాలు

అనుమసముద్రంపేట: మండలంలోని రైతులకు వ్యవసాయశాఖ ద్వారా 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్నట్లు ఏఓ సురేష్‌బాబు బుధవారం తెలిపారు. మండలానికి మొదటి విడతగా జీలుగలు 130, జనుములు 54, పిల్లిపెసర్లు 100 క్వింటాళ్లు చొప్పున మంజూరైనట్లు చెప్పారు. జీలుగలు 10 కిలోల ప్యాకెట్‌ను సబ్సిడీపై రూ.615, జనుములు 10 కిలోల ప్యాకెట్‌ను సబ్సిడీపై రూ.545లు, పిల్లిపెసర్లు 8 కిలోల ప్యాకెట్‌ను సబ్సిడీపై రూ.720కు అందజేస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించి నమోదు చేసుకుని నగదు చెల్లిస్తే విత్తనాలను అందజేస్తామని వివరించారు.

కలిగిరిలో 382 పొగాకు బేళ్ల విక్రయం

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 382 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 573 బేళ్లను తీసుకురాగా, 382 బేళ్లను కొనుగోలు చేశారని, వివిధ కారణాలతో 191 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారని వివరించారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.180, సగటున రూ.233.33 ధర పలికిందని చెప్పారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ తప్పనిసరి



కలిగిరి: వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



సీతారామపురం: జామచెట్లను పరిశీలిస్తున్న ఏఓ చెన్నారెడ్డి



ఆత్మకూరురూరల్: పేరారెడ్డిపల్లిలో మాట్లాడుతున్న ఏడీఏ దేవసేన

ఆత్మకూరురూరల్: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు సమీపంలోని రైతుసేవా కేంద్రాల్లో ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ సూచించారు. మండలంలోని పేరారెడ్డిపల్లిలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకం ఒక కుటుంబంలో ఒకరికే వర్తిస్తుందన్నారు. అర్హులుగా ఉండి జాబితాలో పేరులేని రైతులు రైతుసేవా కేంద్రాల్లో తమ ఆధార్‌కార్డులు, పొలం పాసుపుస్తకాలు జెరాక్స్‌లు అందజేయాలని సూచించారు. ఏఓ కిషోర్‌బాబు మాట్లాడుతూ భూసార పరీక్షా ఫలితాలకు అనుగుణంగా రైతులకు సబ్సిడీపై జింక్‌సల్ఫేట్, జిప్సం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అలాగే వేపనూనె, పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై అందజేస్తున్నామని వివరించారు. ఏఈఓ పోలయ్య, ఎంపీఈఓ ఖాజానవాజ్, ఏఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: మండలంలోని గండిపాళెం, కొండాయపాళెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి వ్యవసాయాధికారి పీ విజయభాస్కర్ మాట్లాడుతూ పచ్చిరొట్ట పైర్లు, సేంద్రియ ఎరువుల ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరామయ్య, ఏఈఓ వినోద్, వీఏఏలు ఫయాజ్, ఖాజారహ్మతుల్లా, శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

సీతారామపురం : మండలంలోని మారంరెడ్డిపల్లి, పబ్బులేటిపల్లి గ్రామాల్లో ఏఓ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జామ తోటలను పరిశీలించి పేనుబంక ఉన్నట్లు గుర్తించారు. వాటి నివారణకు లీటర్ నీటికి 1.5 గ్రాముల అసిఫేట్‌ను కలిపి పిచికారీ చేయాలని సూచించారు. యూరియా, భాస్వరం, పొటాష్ ఎరువులను మొక్కలకు కొంచెం దూరంలో వేయాలని రైతులకు సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలు, జనుములు, జీలుగలు సాగుచేసి పూతదశలో భూమిలో కలియదున్నటం ద్వారా భూమికి కావలసిన సేంద్రియ పదార్థాలు అందడమే గాక, మిత్ర పురుగులు వృద్ధి చెందుతాయని వివరించారు. ఏఈఓ సుధీర్‌కుమార్, వీఏఏలు లక్ష్మీనారాయణ, కవిత, ఉదయగిరి ఏఎంసీ అసిస్టెంట్ చిరంజీవి, రైతులు పాల్గొన్నారు.

కలిగిరి: మండలంలోని అనంతపురంలో వింజమూరు ఏడీఏ శేషగిరిరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ పంటను పరిశీలించి సస్యరక్షణ చర్యలను రైతులకు సూచించారు. అన్నదాత సుఖీభవ జాబితాలో పేర్లు రాని రైతులు రైతుసేవా కేంద్రాల్లో వివరాలు అందజేస్తే ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. ఏఓ ఎస్‌కే జహీర్, ఏఏఓ చిరంజీవి, వీఏఏ వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలం తూర్పుపల్లి, మాముడూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. చేజర్ల ఏఓ హిమబిందు పచ్చిరొట్ట పైర్ల ప్రాముఖ్యత, వరి పంట సాగులో విత్తనశుద్ధి, మొలక శాతం నిర్ధారణ, నారుమడిలో విత్తనాలు చల్లడం, తదితరాలపై అవగాహన కల్పించారు. సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్నట్లు చెపాపరు. అన్నదాత సుఖీభవకు అర్హులైన రైతుల జాబితాలను రైతుసేవా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు తెలిపారు. వ్యవసాయశాఖ సిబ్బంది ఎల్ సుజాత, డీవీ సుబ్బారావు, నితీష్‌కుమార్, శ్రీనివాసులు, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉదయగిరి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో చేపట్టిన పనులను కేంద్ర బృంద సభ్యులు ప్రదీప్‌కుమార్, రామకృష్ణ బుధవారం పరిశీలించారు. మండలంలోని బండగానిపల్లె పంచాయతీలో చెక్‌డ్యామ్‌లో పూడిక తీత పనులు, ఉదయగిరి పట్టణంలోని ఎస్టీ కాలనీ, యాదవపాళెంలో నిర్మించిన ఇంకుడు గుంతల నిర్మాణాలను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. చెక్‌డ్యామ్‌లు, ఇంకుడుగుంతల నిర్మాణాల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చని చెప్పారు. సాంకేతిక సహాయకులు ప్రసన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల చొరవతో రోడ్డు గుంతలకు మరమ్మతులు



కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలో కొండాపురం రోడ్డులో భారీ గుంతలు ఏర్పడడంతో వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు అవస్థ పడుతున్నారు. వర్షం పడితే నీరు నిలిచి గుంతలు కనిపించక ద్విచక్ర వాహనచోదకులు అదుపు తప్పి పడిపోయి గాయాలపాలవుతున్నారు. ఆర్ అండ్‌బీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పలు కారణాలు చెబుతూ సమస్యను పరిష్కరించలేదు. ఈ విషయం తెలుసుకున్న కలిగిరి సీఐ పీ వెంకటనారాయణ, ఎస్సై ఉమాశంకర్ స్పందించారు. బుధవారం రెడిమిక్స్‌తో గుంతలను పూడ్చించి సమస్యను పరిష్కరించారు. పోలీసుల చొరవచూపి గుంతలను పూడ్చించడంపై వాహనచోదకులు ధన్యవాదాలు తెలిపారు.

ప్రమాదభరితంగా వంతెన



జలదంకి: మండలంలోని చామదలలోకి వెళ్లే మార్గంలో వంతెన శిథిలావస్థకు చేరుకుని ప్రమాదభరితంగా ఉంది. చెరువు వద్ద ఉన్న ఈ వంతెన మీదుగానే వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన కూలిపోతే గ్రామానికి రాకపోకలు నిలిచిపోతాయి. వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వంతెనకు ఇరువైలా రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



రోడ్డు ప్రమాదాల నివారణపై అధికారులతో చర్చిస్తున్న ఆర్డీఓ బీ పావని

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని ఏఎస్‌పేట అడ్డరోడ్డు వద్ద నెల్లూరు–ముంబై రోడ్డుపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. ఇటీవల పది రోజుల వ్యవధిలో ఏఎస్‌పేట అడ్డరోడ్డు ప్రాంతంలో రెండు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని ముగ్గురు మృతి చెందగా 11 మంది గాయపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని, జాతీయ రహదారుల సంస్థ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ వీకే చౌదరి, రోడ్డు సేఫ్టీ అడ్వైజర్ సుదేంద్ర, రవాణా శాఖ డీటీసీ చందర్, ఎంవీఐ ఎం రాములు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ గంగాధర్, ఈఈ మురళీకృష్ణ, ఏఈ అమానుల్లాఖాన్, ఎస్సైలు ఎస్‌కే జిలానీ, బీ సాయి ప్రసాద్, తదితరులు ఏఎస్‌పేట అడ్డరోడ్డు ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో వాహనాల వేగ నియంత్రణకు బారికేడ్లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన వాయిదా

ఆత్మకూరురూరల్: తమ సమస్యల పరిష్కారానికి ఆత్మకూరు ఆర్టీసీ డిపో గ్యారేజీ కార్మికులు తలపెట్టిన ఆందోళన కార్యక్రమాన్ని ఉన్నతాధికారుల సూచనల మేరకు వాయిదా వేశామని యూనియన్ నాయకుడు దశరథరామిరెడ్డి బుధవారం తెలిపారు. ఈ నెల 21న విశాఖపట్నంలో జరిగే యోగాడే కార్యక్రమానికి జిల్లా నుంచి ఆర్టీసీ బస్సులు వెళ్లాల్సి ఉందని, ఆ తరువాత డిపో సమస్యలపై తాను విచారణకు వస్తానని రీజనల్ మేనేజర్ హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా వాయిదా వేశామని చెప్పారు. తదుపరి కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. ఏడో వార్డు పరిధిలోని షేక్ మహబూబ్‌బాషా, 21వ వార్డు పరిధిలోని యాకసిరి పోలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాలను పరామర్శించిన కంచి పరమేశ్వరరెడ్డి ఒక్కో కుటుంబానికి రూ.10వేలు చొప్పున నగదు అందజేశారు. ఆయన వెంట ట్రస్ట్ సభ్యులు కుడుముల సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, రాంపల్లి ప్రసాద్ రెడ్డి, మెప్మా ఆర్పీ సుష్మ, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం

ఉదయగిరి: పట్టణంలోని గిరిజన కాలనీకి చెందిన కరంగుల కాశీ కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని పలువురు మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. బుధవారం తన నివాసంలో కాశీ కుటుంబ సభ్యులకు రూ.10 వేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రుణాల రికవరీ శాతాన్ని పెంచాలి



మాట్లాడుతున్న ఏపీఎం స్రవంతి

ఉదయగిరి రూరల్: పొదుపు రుణాల రికవరీ శాతాన్ని పెంచేందుకు వెలుగు సీసీలు కృషి చేయాలని ఏపీఎం స్రవంతి అన్నారు. మండల వెలుగు కార్యాలయంలో సీసీలతో బుధవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. స్త్రీనిధి రుణాల రికవరీ శాతాన్ని పెంచాలన్నారు. పొదుపు సభ్యులు బ్యాంకు లింకేజీ రుణాలను సకాలంలో చెల్లించేలా చూడాలన్నారు. అర్హత కలిగిన గ్రూపులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం పూర్తిచేయాలన్నారు.

బస్‌స్టేషన్‌లో వసతుల కల్పనకు చర్యలు



సురేష్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కలిగిరి: కలిగిరి ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. కలిగిరి ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు బస్‌స్టేషన్ ప్రాంగణంలో వ్యాపారాలు చేసుకోవడానికి స్థలాలను అద్దె ప్రాతిపదికన కేటాయించాలని కోరారు. బస్‌స్టేషన్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, ఆవరణను శుభ్రం చేయించాలని, ఆర్టీసీ బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ వార్డు సభ్యులు వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు నందనవనం ప్రభాకర్‌రావు, వాకా మాల్యాద్రి, ప్రభాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రాంబాబు, వెంకటరమణయ్య, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ మూసివేత

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు : మండలంలోని అప్పారావుపాళెంలోని ఇసుకరీచ్‌ను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మూసివేశారు. 'సాక్షి'లో 'నిషేధమున్నా తగ్గేదేలే' అన్న శీర్షికన మంగళవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో ఆర్డీఓ బీ పావని ఆదేశాల మేరకు తహసీల్దార్ పద్మావతి బుధవారం ఇసుకరీచ్‌లోకి సిబ్బందిని పంపి మూసివేయించారు.

నాణ్యత నగుబాటు



జిల్లావాగుపై బ్రిటిష్ హయాంలో నిర్మించిన వంతెన (ఇన్‌సెట్లో) 1944లో నిర్మించినట్లుగా బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన బోర్డు

- నేటి చెక్కుచెదరని బ్రిటిష్ హయాంలో నిర్మించిన జిల్లావాగు వంతెన
- 20ఏళ్లకే దెబ్బతిన్న బొగ్గేరు వంతెన



దెబ్బతినడంతో బొగ్గేరు వంతెనపై మరమ్మతులు చేపట్టిన దృశ్యం

ఆత్మకూరురూరల్: మండలంలో దేపూరు వద్ద ఆత్మకూరు–సోమశిల మార్గంలో జిల్లా వాగుపై 80ఏళ్ల క్రితం బ్రిటిష్ హయాంలో నిర్మించిన వంతెన నేటికి చెక్కుచెదరకుండా ఉండగా, 20 ఏళ్ల క్రితం బొగ్గేరుపై నిర్మించిన వంతెన మాత్రం అప్పుడే దెబ్బతింటూ నాణ్యతను ప్రశ్నిస్తోంది. మండలంలోని రామస్వామిపల్లి, మహిమలూరు, బంట్లపల్లి, అనంతసాగరం మండలం నల్లరాజుపాళెం, మినగల్లు, తదితర ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు మహిమలూరు సమీపంలో జిల్లావాగుగా మారుతుంది. అనంతరం దేపూరు మీదుగా ఆత్మకూరు మండలం అప్పారావుపాళెం వరకు పయనించి బొగ్గేరులో కలుస్తుంది. జిల్లావాగు మీద ఆధారపడి తరతరాలుగా రైతులు పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం మహిమలూరు నుంచి బట్టేపాడు సమీపం వరకు జిల్లావాగు పూడిపోయి రైతులకు ఇబ్బందికరంగా మారింది. అయితే దేపూరు వద్ద 1944లో బ్రిటిష్ హయాంలో నిర్మించిన వంతెన మాత్రం ఇప్పటికీ చెక్కుచెదరకుండా నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. కాగా దేపూరుకు తూర్పువైపున పాతజంగాలపల్లి వద్ద బొగ్గేరుపై 20 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన కొంత భాగం అప్పుడే మరమ్మతులకు గురైంది. వంతెనకు ఇరువైపులా ఇసుక, మట్టి వ్యర్థాలు పేరుకుపోయి వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా పరిణమించడం గమనార్హం.